క్లుప్తంగా

ఘనంగా వినోబాభావే జయంతి

ఇందుకూరుపేట : స్థానిక పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆచార్య వినోబాభావే జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వినోబా భావే చిత్రపటానికి జిల్లా సర్వోదయ మండలి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రత్నరాజు, ఆశ్రమ కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమ కో కన్వీనర్ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య చరిత్రలో ఆచార్య వినోబాభావే స్ఫూర్తిదాయక వ్యక్తి అని కొనియాడారు. ఆయన మహాత్మాగాంధీకి అత్యంత సన్నిహితుడని తెలిపారు. గాంధీజీ మరణానంతరం ఆయన కలల సమాజ నిర్మాణం కోసం భావే అహర్నిశలు కృషి చేశారని స్మరించుకున్నారు.జిల్లా సర్వోదయ మండలి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అంకయ్య మాట్లాడుతూ వినోబాభావే భూదాన్ ఉద్యమం వంటి పోరాటాల ద్వారా సుసంపన్నమైన, సుస్థిరమైన దేశాన్ని నిర్మించాలని ఆశించారని తెలిపారు. ఆశ్రమ మేనేజర్ మనోజ్, గ్రామస్తులు, సర్వోదయ మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పొదలకూరు : డీఎస్సీ-2003 రాష్ట్ర ఫోరం ఇచ్చిన పిలుపు మేరకు అప్పటి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004కు ముందు నోటిఫికేషన్ విడుదలై ఫలితాలు వచ్చినా కొన్ని అనివార్య కారణాల వల్ల తమ నియామకాలు ఆగిపోయాయన్నారు. కేంద్రప్రభుత్వం 1/9/2004 ముందు నోటిఫికేషన్ ఇచ్చి నియామకం ఆగిపోయిన వారి కోసం మెమో నంబరు 57 తీసుకొచ్చిందని తెలిపారు. దీన్ని ప్రకారం 19 రాష్ట్రాల్లో ఉద్యోగులకు ఓపీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. మన రాష్ట్రంలో కూడా గత ప్రభుత్వం సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మార్చడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం సీపీఎస్‌ను ఓపీఎస్‌కు మార్చడం లేదన్నారు. రాష్ట్రంలో 11వేల మందికిపై ఉద్యోగులు బాధితులుగా ఉన్నారని, తక్షణమే కేంద్రప్రభుత్వ మెమో నంబరు 57ను అమలు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ బీ శివకృష్ణయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు.

పంట కాలువలో వ్యర్థ జలాల ప్రవాహం

- దెబ్బతింటున్న పంటలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



జాఫర్ సాహెబ్ డిస్ట్రిబ్యూటరీ చానల్‌లో పారుతున్న వ్యర్థ జలాలు

తోటపల్లిగూడూరు: జాఫర్ సాహెబ్ డిస్ట్రిబ్యూటరీ చానల్‌లోకి వ్యర్థ జలాలను విడుదల చేస్తుండడంతో పంటలు సరిగా పండడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాఫర్ సాహెబ్ డిస్ట్రిబ్యూటరీ చానల్ నుంచి మండలంలోని కోడూరు, మాచర్లవారిపాళెం, వరిగొండ కాలువలకు సాగు నీరు అందుతుంది. ఈ కాలువల ద్వారా దాదాపు 22వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ ఏడాది సోమశిలలో నీరున్న నేపథ్యంలో ఎడగారు సాగుకు అధికారులు సాగునీరందించారు. ప్రస్తుతం ఎడగారు పంట చివర దశలో ఉండడంతో అధికారులు సాగునీటి విడుదలను కొంత మేర నిలిపివేశారు. నెల్లూరు నుంచి నరుకూరు వరకు ఉన్న జాఫర్ సాహెబ్ డిస్ట్రిబ్యూటరీ చానల్‌లోకి దాన్ని అనుకుని ఉన్న పలు పరిశ్రమల్లోని వ్యర్థ జలాలను విడుదల చేస్తున్నారు. ముఖ్యంగా అల్లీపురం నుంచి నరుకూరు వరకు ఉన్న అనేక రైసు మిల్లుల్లోని వ్యర్థ జలాల ప్రవాహం అధికంగా ఉంటోంది. ప్రస్తుతం సాగునీటిని విడుదలను నిలిపివేసిన నేపథ్యంలో వివిధ రకాల రసాయనాలు కలగలిసిన ఈ వ్యర్థ జలాలు పంట పొలాలకు చేరి పచ్చని పంటలు నాశనమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జాఫర్ సాహెబ్ డిస్ట్రిబ్యూటరీ చానల్‌లో నీటి ప్రవాహం లేనందున వ్యర్థ జలాలను పారిస్తున్న పరిశ్రమలను గుర్తించి వాటి యజమానులపై చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

కోవూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచించారు. నెల్లూరులోని నివాసంలో ప్రసన్నకుమార్‌రెడ్డితో పాటు పార్టీ యువజన విభాగ అధ్యక్షుడు రజత్‌కుమార్‌రెడ్డిని పార్టీ పబ్లిసిటీ వింగ్ కార్యదర్శి కొట్టే మల్లికార్జున, పార్టీ వలంటీర్ల విభాగ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గండవరపు సురేఖ తదితరులు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలను తెలియజేశారు. కొడవలూరు మండల పార్టీ అధ్యక్షులు చిమటా శేషగిరి, వెంకటరత్నం, అనికేపల్లి, అంచూర్ బలరాం, వేల్పుల నరసింహారావు, చిమటా వెంకటేశ్వర్లు, వేల్పుల హరిబాబు, సుధీర్, పవన్, చంద్ర, చిన్న, తూము శివకుమార్, మల్లి తదితరులు పాల్గొన్నారు.



ప్రసన్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొట్టే మల్లికార్జున



ప్రసన్నను కలిసిన సురేఖ



ప్రసన్నను కలిసిన నాయకులు

పెన్నానదిలో మృతదేహం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు తిక్కనపార్కు సమీప పెన్నానదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించి సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. స్విమ్మింగ్ కళ్లజోడు ధరించి ఉన్నాడు. కుడిచేతిపై ఎం.చెంచమ్మ, ఎం.శ్రీనివాసులు, ఎం.నాగమ్మ, ఎం.మీరమ్మ, ఎం.శివ, ఎం.మల్లి పేర్లు, చేతి వెనుకవైపు ఢమరుకం, పాము గుర్తు పచ్చబొట్లున్నాయి. చనిపోయి రెండు, మూడురోజులై ఉండొచ్చని భావిస్తున్నారు. ఎస్సై బాలకృష్ణ మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడా?, మరే ఇతర కారణం ఉందా? అనే వివరాలు తెలియరావాల్సి ఉంది.
వివరాలు తెలిసిన వారు 94407 00097, 94407 96307 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముత్తుకూరు విద్యార్థి



యశ్వంత్

ముత్తుకూరు(పొదలకూరు) : ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి డీ యశ్వంత్ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికయ్యాడు. ఇందుకూరుపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో సత్తాచాటి అండర్-14 సెపక్‌తక్రా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం చల్లా శ్రీనివాసులు తెలిపారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొననున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా యశ్వంత్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులను హెచ్‌ఎం అభినందించారు.

వీఎస్‌యూలో గ్లాస్ అండ్ గ్లాసింగ్ స్కిల్ సెంటర్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో గ్లాస్ అండ్ గ్లాసింగ్ స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వైస్‌చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారత గ్లాస్ మ్యాన్‌ఫాక్చరర్స్ ఆహ్వానం మేరకు ముంబైలో బుధవారం జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో తాను పాల్గొన్నానని చెప్పారు. ఈ సందర్భంగా వీఎస్‌యూలో గ్లాస్ అండ్ గ్లాసింగ్ స్కిల్ ఏర్పాటుకు సంబంధించి చర్చలు జరిపామని, ఫెడరేషన్ సభ్యులు అందుకు అంగీకరించారని తెలిపారు.

సాయిబాబాకు పల్లకిసేవ

పొదలకూరు : స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం రాత్రి బాబాకు పల్లకిసేవ నిర్వహించారు. ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భక్తులు భజనలు చేశారు. రాత్రి పల్లకిసేవ, శేజ్‌హారతి నిర్వహించారు.

కావలి వీఎస్‌యూ కళాశాలలో బీఫార్మసీ కోర్సు ప్రారంభం

వెంకటాచలం: కావలిలోని వీఎస్‌యూ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి బీఫార్మసీ కొత్త కోర్సును ప్రారంభిస్తున్నట్లు వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కే సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు ప్రారంభంతో ప్రాంతీయ విద్యార్థులు ఇకపై దూరప్రాంతాలకు వెళ్లకుండానే కావలిలోనే చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. కోర్సులో చేరదలచిన విద్యార్థులు ఏపీ ఎంసెట్-2025 కౌన్సెలింగ్‌లో వీఎస్‌యూ పీఎస్‌ఎఫ్ కళాశాల కోడ్ పీహెచ్‌ఎం కోర్సు అనే వెబ్‌ఆప్షన్‌ను ఎంచుకుని చేరవచ్చునని వివరించారు. నాలుగేళ్ల బీఫార్మసీ కోర్సుకు ఫీజు ఏడాదికి రూ.60వేలు కాగా, ఫీజురీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థులు ఉచితంగా చదవవచ్చునని తెలిపారు.

ఈదూరు గ్రామసచివాలయం ప్రారంభం

తోటపల్లిగూడూరు: మండలంలోని ఈదూరు పంచాయితీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం పర్యటించారు. ముందుగా గ్రామసచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఈదూరు-మండపం లింకురోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు బాబునాయుడు, సోమిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, బొమ్మిసురేంద్ర, కొణతం రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పదహారు రోజుల పండుగ

పొదలకూరు : వినాయక చవితి వేడుకలను నిర్వహించి పదహారు రోజులు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో పదహారు రోజుల పండుగను గురువారం వైభవంగా నిర్వహించారు. వినాయకుడి పటాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పద్మావతినగర్‌లోని వినాయకస్వామి మండపం నిర్వాహకులు పందరి భజనను ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

వేవేల దండాలు తల్లీ.. పోలేరమ్మా

- జైపోలేరు.. జైజై పోలేరంటూ మార్మోగిన వెంకటగిరి
- జన జాతరకు లక్షలాది మంది రాక
- నిబంధనలకు స్వస్తి.. ఏరులై పారిన మద్యం
- కూటమి నేతల కోసం ప్రత్యేక క్యూలైన్
- ముగిసిన పోలేరమ్మ జాతర

పోలేరమ్మ జాతర ముగిసింది. అయితే ఈ ఏడాది జాతర సంప్రదాయాలకు కూటమి నేతలు స్వస్తి పలికారు. అంతటా వారి పెత్తనమే ఎక్కువగా కనిపించింది. జాతర వేళ రెండురోజులపాటు పూర్తిగా మద్యం అమ్మకాలను నిలిపివేయడం మొదటి నుంచి వస్తున్న ఆనవాయితీ. అయితే 48 గంటల పాటు కాకుండా కేవలం 24 గంటలు మాత్రమే నిషేధించారు. రాజాలకు కనీస మర్యాదలు కూడా ఇవ్వకుండా కూటమి నేతలు అడుగడుగునా అడ్డు తగిలారు. మరోవైపు తాగునీటి కోసం భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.



పోలేరమ్మ నగరోత్సవం



ప్రత్యేకాలంకారంలో పోలేరమ్మతల్లి

వెంకటగిరి(సైదాపురం): కోరిన కోర్కెలు తీర్చే తల్లీ.. పోలేరమ్మా.. కాపాడగరావమ్మా.. అంటూ భక్తజనం పోలేరమ్మ ఎదుట ప్రణమిల్లారు. జాతర సందర్భంగా వెంకటగిరి పురవీధులన్నీ స్వర్ణకాంతులతో దేదీప్యమానంగా కాంతులీనాయి. అమ్మవారి ప్రతిరూపాన్ని తనివితీరా దర్శించుకున్న భక్తులు పులకించారు. పట్టణమంతా జై పోలేరూ.. జైజై పోలేరూ తల్లీ అంటూ మార్మోగింది. జిల్లా నలుమూలలే కాకుండా దేశవిదేశాల నుంచి కూడా పోలేరమ్మ జాతరకు విచ్చేయడంతో దారులన్నీ వెంకటగిరివైపే మళ్లాయి. దీంతో ఎక్కడ చూసినా జనమే దర్శనమిచ్చారు.

ఆనందోత్సాహాల నడుమ..

నగరోత్సవం ప్రారంభం కాగా భక్తులు పెద్దఎత్తున వీక్షించారు. బుధవారం అర్ధరాత్రి అమ్మవారి మెట్టునిల్లు అయిన జీనుగులవారి వీధి నుంచి వేకువజామున నాలుగు గంటలకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం వద్ద ప్రత్యేకంగా నిర్మించిన మండపంలో అధిష్టించారు. తెల్లవారుజాము నుంచే భక్తులను దర్శనానికి అనుమతించారు. అయితే నామమాత్రంగా ఒక గంటపాటు వాటర్, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఉచిత దర్శనం, రూ.100, రూ.300 టికెట్లను కొనుగోలు చేసిన భక్తుల కోసం పాతబస్టాండ్ మీదుగా కొత్తగా క్యూలైన్‌ను పొడిగించారు. అమ్మవారి సాంగెం పోలీసు బందోబస్తు నడుమ రాజా భవనం నుంచి అమ్మవారి ఆలయం వద్ద తీసుకురావాల్సి ఉండగా అవేవీ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఏడాది కూటమి నేతల కనుసన్నల్లో జాతర జరిగింది. గతంలో ఉన్న వీఐపీ క్యూలైన్ పూర్తిగా ఎత్తేసి ప్రోటోకాల్ ఉన్నవారికి మాత్రమే ప్రత్యేక దర్శనమని ప్రకటించారు. కానీ అదంతా కేవలం ప్రకటనలకే పరిమితమైంది.

సారె సమర్పణ

వెంకటగిరి రాజా కుటుంబీకుల సర్వజ్ఞకుమార కృష్ణ యాచేంద్రతోపాటు పలువురు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సారెను సమర్పించారు. ఆలయ మహాద్వారం నుంచి పసుపు కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలతో కూడిన సారెను అందించారు. అంతకుముందు నెల్లూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ నేత బొలిగర్ల మస్తాన్ యాదవ్, నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దున్నపోతు బలితో..

జాతర సంప్రదాయ ప్రకారం అమ్మవారికి దున్నపోతు బలి కార్యక్రమం జరిగింది. అమ్మవారి నిమజ్జనం పూర్తయ్యే వరకు గండదీపం ఆరిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. బలి పూర్తి కాగానే గ్రామ పొలిమేరల్లో నాలుగుదిక్కులా పొలి చల్లారు.

పట్టువస్త్రాల సమర్పణ

జాతర సందర్భంగా దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా మేళతాళలతో పట్టువస్త్రాలను సమర్పించారు.



ఆలయం వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



బలి కత్తికి పూజ చేసి తీసుకెళ్తూ..



మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్తూ..

పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థిక స్వావలంబన



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

పొదలకూరు : పొదుపు మహిళలు పెరటి కోళ్ల పెంపకం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ ప్రాంగణంలో పొదుపు మహిళలకు పెరటి కోళ్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీడీ మాట్లాడుతూ మండలానికి వంద యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. ఒక యూనిట్‌లో 11 కోళ్లు ఉంటాయని, యూనిట్‌ను రూ.3,300కు అందజేయడం జరుగుతుందన్నారు. పొదుపు మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, ఏపీఎం చిన్నయ్య, లైవ్‌స్టాక్ డీపీఎం డాక్టర్ భానుప్రసాద్, డీపీఎం మధుసూదన్, ఎల్‌హెచ్ ఏపీఎం దుర్గాశ్రీనివాస్, నాయకులు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున్‌నాయుడు, సుగుణమ్మ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పొదుపు మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎస్బీఐ జీఎం మురళీనాయక్

కోవూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ మురళీనాయక్ అన్నారు. భారత ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు గ్రామీణులకు బ్యాంకింగ్ సేవలు, సైబర్‌నేరాలు, ఆర్థిక అక్షరాస్యతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కోవూరు ఎస్‌బీఐ ప్రధాన శాఖ ఆధ్వర్యంలో గ్రామ సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక కేవీఎస్ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మురళీనాయక్ ముఖ్యఅతిథిగా హాజరై పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ ఖాతాదారులు కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఖాతాదారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయకూడదని, ఎటువంటి పరిస్థితుల్లోనూ ఓటీపీ లేదా పాస్‌వర్డ్‌లను ఇతరులకు ఇవ్వకూడదని తెలిపారు. పలువురు బ్యాంకు అధికారులు ఎస్బీఐ పథకాలు, బీమా పథకాలు, పొదుపు పథకాలు, రుణ అవకాశాలు, డిజిటల్ సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం పొదుపు మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఆర్బీఐ మేనేజర్ రాజేష్, డివిజనల్ మేనేజర్ మణిశేఖర్, ఎఫ్ఐ మేనేజర్ మల్లికార్జున బాబు, ఎస్బీఐ ఏసీబీ మేనేజర్ బాలకృష్ణ, మెయిన్ బ్రాంచ్ మేనేజర్ రాఘవేంద్ర, అధికారులు దినేష్, గులాం. తదితరులు పాల్గొన్నారు.

అక్కంపేట చెరువు ఆక్రమణలపై సర్వే



సర్వే చేపడుతున్న అధికారులు

మనుబోలు: మండలంలోని అక్కంపేటలోని పెద్ద, చిన్న చెరువు ఆక్రమణలపై ఇరిగేషన్ అధికారులు గురువారం సర్వే చేశారు. ఈ సందర్భంగా కనుపూరు కెనాల్ ఇరిగేషన్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కనుపూరు కెనాల్ పరిధిలోని పలు చెరువులు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. చివరి ఆయకట్టు రైతులు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో కనుపూరు కెనాల్ పరిధిలోని మనుబోలు మండలంలోని పన్నెండు చెరువులకు హద్దులు చూపాలని నీటి తీరువా కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించి తమను కోరిందన్నారు. అందులో భాగంగా ముందుగా అక్కంపేట పెద్ద, చిన్న చెరువులను సర్వే చేపట్టామని తెలిపారు. మడమనూరు, వడ్లపూడి, జట్లకొండూరు, అక్కంపేట గ్రామాల పరిధిలోని మొత్తం 12 చెరువులను సర్వే చేపట్టి హద్దులు చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, నీటి తీరువా సంఘ అధ్యక్షుడు కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగులో మెళకువలు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

విడవలూరు: వేరుశనగ సాగులో రైతులు మెలకువలు పాటించాలని కోవూరు ఏడీఏ జీ అనిత సూచించారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ అండ్ ఆయిల్ సీడ్స్ (ఎన్‌ఎంఈఓ) పథకం కింద మండలంలోని ఊటుకూరు, రామతీర్థం, రామచంద్రాపురం గ్రామాల్లో క్షేత్ర దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవూరు ఏడీఏ అనిత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఈఓ పథకం కింద నూనె గింజల పంటల సాగుకు అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. అనంతరం వేరుశనగ సాగులో సస్యరక్షణ చర్యలను సూచించారు. వేరుశనగలో సోలార్ ట్రాప్స్, జిగురు అట్టల ఏర్పాటు, బంతి, ఆముదం చెట్ల పెంపకం ద్వారా తెగుళ్లను నివారించవచ్చని వివరించారు. ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి, ఎఫ్‌పీఓ వెంకటకుమార్, వీఏఏలు ప్రవీణ్, చెంచులక్ష్మి, భువన, ప్రత్యూష, రామచంద్రాపురం సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పనిఒత్తిడి నుంచి విముక్తి కల్పించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

విడవలూరు: ఒత్తిడితో కూడిన విధుల నుండి తమకు విముక్తి కలిగించాలని కోరుతూ మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది ఎంపీడీఓ నగేష్ కుమారికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ విధులతో పాటు ఇంటింటి సర్వేలను అప్పగించడంతో తమపై పని భారం పెరుగుతోందని, పనిఒత్తిడి వల్ల తాము శారీరకంగా, మానసికంగా సమస్యలు ఎదుర్కొంటున్నామని విన్నవించారు. తామంతా ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, కాకపోతే అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు నేషనల్ ఇంక్రిమెంట్స్ అందించాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే తాము పోరాటానికి సిద్ధమని తెలిపారు. సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు సహాస్, లక్ష్మీనారాయణ, ఖాదర్, శ్రీను, ప్రసాద్, మనోజ్, శైలజ, విష్ణుప్రియ, శ్వేత, పవన్, ఆనందరావు , తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ జయప్రదానికి పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

పొదలకూరు : విద్యారంగ సమస్యల పరిష్కారానికి శుక్రవారం చేపడుతున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ పిలుపునిచ్చారు. పొదలకూరులో చలో కలెక్టరేట్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు విద్యారంగ సమస్యలను పరిష్కరించలేదన్నారు. మంత్రి లోకేశ్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ సక్రమంగా అమలవక పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో సమస్యలు తీవ్రస్థాయిలో ఉన్నాయన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాను చేపడతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేజ, శీనయ్య, హర్ష, వంశీ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న దాతలు

మనుబోలు: మండలంలోని కొమ్మలపూడి గిరిజన కాలనీలో రెండ్రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు మాజీ సర్పంచ్ మన్నెమాల శ్రీనివాసులురెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ మన్నెమాల భాస్కర్‌రెడ్డి గురువారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. గిరిజన కాలనీకి చెందిన వెండోటి పోలయ్య, వెండోటి కొండయ్య గుడిసెలు పూర్తిగా కాలిపోగా బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం తరఫున పక్కాగృహాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.